'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# బుల్డోజర్ సంస్కృతే అసలైన ప్రకృతి వైపరీత్యం



తుల్జారాంసింగ్ ఠాకూర్
78930 05313

**Oh god! fill my city with people just as you have filled river with fish.**

**433 సంవత్సరాల క్రితం 1591లో ఒక సుదినాన హైదరాబాద్ నగరానికి పునాది వేస్తూ.. గోల్కొండ ప్రభువు కులీ కుతుబ్ షాహీ చేసిన ప్రార్థనా వాక్యం ఇది. ఆయన ప్రార్థనను భగవంతుడు మన్నించడంతో హైదరాబాద్ శతాబ్దాలుగా విశ్వనగరంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.**

ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' నినాదం అప్పట్లో దేశ ప్రజలను, వారి హృదయాలను చూరగొన్నది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ ఎత్తుకున్న 'నఫ్రత్ కీ బజార్ మే మహబ్బత్ కా దుకాణ్' కూడా పీడిత ప్రజలను, దళిత బహుజనులను, ప్రత్యేకించి మైనారిటీలను ఆకట్టుకుంది. బీజేపీ పాలనలో అభద్రతాభావానికి గురవుతున్న ప్రజానీకం మెజారిటీ మతతత్వవాదం పేట్రేగిపోతున్న సందర్భంలో అందుకున్న నినాదం సహజంగానే ప్రజలను ఆకర్షించింది. తత్ఫలితంగానే కాంగ్రెస్ తిరిగి కొంతమేరకు పుంజుకోవడమే కాకుండా అనూహ్యంగా తెలంగాణ రాష్ట్రంలో అధికార పీఠం కైవసం చేసుకున్నది.

**కానీ, దురదృష్టవశాత్తూ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ కేవలం తన దూకుడు, కుల సమీకరణాల వల్లనే అధికారంలోకి వచ్చామనే అపోహతో అహంకారపూరితంగా వ్యవహరిస్తూ రాష్ర్టానికి, పేద, మధ్యతరగతి బడుగు జీవులకు ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నది. యూపీ, గుజరాత్, అసోం తదితర బీజేపీ పాలిత బుల్డోజర్ పద్ధతులను అవలంబించి అతి తక్కువ కాలంలోనే సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉండిన దళిత, బహుజన, మైనారిటీ వర్గాల తీవ్ర ఆక్రోశాన్ని ఎదుర్కొంటున్నది.**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన హైడ్రా ఆపరేషన్లు సంపన్న, సూడో మేధావి వర్గాలకు ఆనందాన్ని కలుగజేస్తుండవచ్చు. కానీ, పేద, మధ్యతరగతి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఎప్పుడో దశాబ్దాల కిందట పేద ప్రజలు కట్టుకున్న నిర్మాణాలు మాత్రమే హైదరాబాద్ నగరంలో అతి వర్షాల వల్ల కలిగే ప్రకృతి



వైపరీత్యాల విధ్వంసానికి కారణమన్నట్టుగా ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరు అత్యంత ప్రమాదకరంగా ఉన్నది.

కులీన సంపన్నవర్గాలు దశాబ్దాలుగా చేస్తున్న పర్యావరణ బీభత్సం, ఔటర్ రింగు రోడ్డు విధ్వంసం, అర్బనైజేషన్ పేరిట పారిశ్రామికీకరణ, ఫార్మా, ఐటీరంగాల వల్ల తెలంగాణ రాష్ర్టానికి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరిగిన విధ్వంసం ఏపాటిదో పాలకులు గుర్తించడం లేదు. చిన్న చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ప్రైవేట్ రంగంలో వెట్టిచాకిరీ చేసి జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న డబ్బులను వెచ్చించి, తల తాకట్టు పెట్టి తీసుకున్న ప్రైవేట్ రుణాలు, బ్యాంకు రుణాలతో పేదలు కట్టుకున్న గూళ్లను రాత్రికిరాత్రి నేలమట్టం చేయడం ఏ రకంగా 'మహబ్బత్ కీ దుకాణో' రాహుల్ గాంధీ చెప్పాలి.

పది మిలియన్ సంవత్సరాల కిందట ఏర్పడిన రాతి శిలలను, గుట్టలను రేయింబవళ్లు రియల్ ఎస్టేట్ రంగం పిండి పిప్పి చేస్తున్న విధ్వంసం కంటే పేద ప్రజలు కట్టుకున్న ఇరుకు గదుల ప్రకృతి వైపరీత్యం ఎక్కువైందా? మూసీ, ఈసీ, కాగ్నా నదుల జన్మస్థానం వికారాబాద్, దామగుండం అడవుల్లో వెరి లో ఫ్రీక్వెన్సీ రాడార్ కేంద్రం కోసం లక్షలాది చెట్ల నరికివేత ద్వారా జరగనున్న ప్రకృతి విధ్వంసం ముందు పేద ప్రజలు కట్టుకున్న ఇళ్లు చేస్తున్న నష్టం ఏపాటిది? పటాన్‌చెరు, పాశమైలారం, జీడిమెట్ల, బొల్లారం, బొంతపల్లి తదితర ప్రాంతాల్లో వెలసిన కాలుష్య కాసారాల ప్రకృతి హననం ముందు సంపన్నుల ఇళ్లలో బోళ్లు, బొచ్చెలు కడిగి బతుకు వెళ్లదీస్తున్న బడుగుజీవుల ప్రకృతి విధ్వంసం భరించరానిదైందా?

**తెలిసో, తెలియకో అవసరాల నిమిత్తమో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మోసాలకు, మాయలకు బలైపోయిన అమాయక జీవుల జీవనాన్ని విధ్వంసం చేసి ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ సర్కార్ ఏం సాధించాలనుకుంటున్నది? రౌడీ షీటర్లు, నేరస్థులు, సంఘ వ్యతిరేక శక్తులను అణచివేయడానికి యూపీ రాష్ర్టానికి పరిమితమైన బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అదే పంథాను తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల మీద కొనసాగించాలనుకోవడమే అసలై న ప్రకృతి వైపరీత్యం.**

దక్కన్ పీఠభూమి బంగారు తునక తెలంగాణ రాష్ర్టానికి ఆత్మ అనదగిన చెరువులు, వాగులు, నాలాలు, గుట్టల పరిరక్షణ పేరిట హైడ్రా చేపట్టిన చర్యలు అపసవ్య దిశలో ఉండటమే ప్రస్తుత భయానక భీతావహ పరిస్థితులకు కారణమని చెప్పవచ్చు. ఒకవేళ చర్యలు ప్రారంభించాల్సి వస్తే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో లే అవుట్లు వేసి, ఇండ్లను కట్టి అవసరమైన అనుమతులను సంపాదించి అమాయక ప్రజలకు అమ్ముకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల మీద కదా మొదట చర్యలు తీసుకోవాల్సింది. నాలా కన్వర్షన్, బిల్డింగ్ అనుమతులు ఇచ్చి ఆస్తి పన్నులు, కరెంటు బిల్లులు వసూలు చేసిన ప్రభుత్వం బాధితులకు ఆమోదయోగ్యమైన పునరావాసాలు కల్పించిన తదుపరి కదా రంగంలోకి దిగాల్సింది. ఎలాంటి అనుమతులు లేని నాలాల మీద వెలసిన అక్రమ కట్టడాలు తొలగించడానికి ముందు వారికి సమీప ప్రాంతాల్లో ప్రభుత్వమే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

భవిష్యత్తులో ఎవ్వరికీ 500 గజాల పైబడి స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వకూడదు. ఎందుకంటే, జనాభా పెరుగుతుంది కానీ, భూమి పెరగదనే ప్రాథమిక సూత్రాన్ని మరచిపోకూడదు. వేలాది అపార్టుమెంట్లు, విల్లాలు కడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు భవిష్యత్తులో వారి ఇండ్లలో పని చేయాల్సిన పనివారు, డ్రైవర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు నివాసం ఉండటానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా బిల్డర్ల పరిధిలోనే ఉండేలా చట్టం తీసుకురావాలి.

# హరప్పా శోధనకు వందేండ్లు



శ్రీరామోజు హరగోపాల్

**ప్రపంచ మానవ నాగరికత వికాసాల్లో సింధూ నాగరికత స్థానం విశిష్టమైనది. 1924, సెప్టెంబర్ 20న 'ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్'లో ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ జాన్ మార్షల్ రాసిన వ్యాసం ద్వారా సింధూ నాగరికత గురించి ప్రపంచానికి తెలిసింది. జాన్ మార్షల్‌తో పాటు పనిచేసిన రాఖాల్ దాస్ బెనర్జీ, కేఎన్ దీక్షిత్, మాధోసరూప్ వాట్స్ తదితర పరిశోధకులు, లుయిగీ పియో టెస్సిటోరి వంటి ఇతరులు అవిభక్త భారతదేశంలో సింధూ నదీ తీరంలో పలుచోట్ల నాగరికత ఆనవాళ్లను గుర్తించారు.**



హరప్పా తవ్వకాల తొలి దశలో లభించిన పురావస్తువుల ఆధారంగా సింధూలోయ నాగరికత కాలాన్ని క్రీ.పూ.3200-క్రీ.పూ.1900ల మధ్యకాలంగా పరిశోధకులు నిర్ణయించారు. ఈ నాగరికతకు మూలాలు బలుచిస్థాన్‌లో ఉన్న మెహర్‌గఢ్‌లో లభించిన క్రీ.పూ.7000 సంవత్సరాల నాగరికతకు కొనసాగింపు అనిపించాయి.

సింధూలోయ తవ్వకాల్లో పెద్ద వీధులతో, రక్షణ ప్రాకారాలతో చక్కని ప్రణాళికతో నిర్మించిన నగరాలు, మూతలతో కూడిన మురికినీటి కాలువల వ్యవస్థ, ధాన్యాగారాలు, గిడ్డంగులు, పడవ రేవులు, వ్యాపారకేంద్రాలు, ఇప్పటికీ చదువని లిపితో, జంతువుల బొమ్మలతో దొరికిన స్టియటైట్‌తో చేసిన 'ముద్రలు' ఆనాటి ప్రజల నాగరిక జీవనం ఎంత చక్కని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేదో చెప్పే సాక్ష్యాలు.

హరప్పా నాగరికతగా తొలుత పేర్కొనబడిన ఈ పురానాగరికతలో వెలుగుచూసిన పెద్ద నగరాల్లో మొహెంజొదారో ఒకటి. 1922లో రాఖాల్‌దాస్ బెనర్జీ దీన్ని కనుగొన్నారు. ప్రణాళికాబద్ధమైన పురాతన నగర వ్యవస్థకు మొహెంజొదారో చక్కటి ఉదాహరణ. ధార్మిక కార్యక్రమాల్లో వాడుకున్న విశాల స్నానవాటిక జాడతో తొలినాటి ప్రజా జలపంపిణీ వ్యవస్థ గురించి తెలిసింది. పెద్దఎత్తున ధాన్యాగారాల ఆనవాళ్లు లభించడం వల్ల తిండి గింజలను వార్షిక వనరుగా భద్రపరిచే భవిష్య ప్రణాళిక అర్థమవుతున్నది. పాలకులకు కోటతో కూడిన నిర్మిత నగరం, సాధారణ ప్రజలకు చిన్న నగరం జాడలు నాటి పాలక వ్యవస్థకు నిదర్శనం. మట్టి ఇటుకలతో కట్టిన ఇళ్లు వసారాలతో, స్నానాల గదులతో బయటపడ్డాయి. మురికి కాలువలకు అనుసంధానం చేసిన వ్యక్తిగత మరుగుదొడ్లు అప్పటి డ్రైనేజీ వ్యవస్థను తెలియజేస్తున్నాయి. ఇండ్లు కట్టడానికి వాడిన ఘనపు ఇటుకలు 1:2:4 నిష్పత్తిలో చక్కని కొలతలతో ఉన్నాయి. ఈ నగరంలో లభించిన ముద్రలు నాటి పటిష్ఠ ఆర్థిక వ్యవస్థకు గుర్తులు. అప్పటి ప్రజలు వాడిన పాత్రలు, పనిముట్లు కంచు, రాగితో చేసినవి. అందువల్లనే నాటి నాగరికతను కాంస్యయుగపు నాగరికతగా పేర్కొన్నారు. నగర వీధులు ఎడ్లబండ్లు తిరిగేంత పెద్దవిగా ఉండేవి.

**దక్షిణాసియాలోనే విశిష్టమైన సంక్లిష్ట సమాజ నాగరికతల జాడలు హరప్పా తవ్వకాల్లో దొరికాయి. హరప్పా నాగరితను తొలిదశ (క్రీ.పూ.3300-2600), వికాస దశ (క్రీ.పూ.2600-1900), అనంతర దశ (క్రీ.పూ.1900-1700) అని విభజించారు. ఇటీవలి తవ్వకాల్లో ఘగ్గర్ పరీవాహక ప్రాంతంలో (ఋగ్వేద సరస్వతి నదీ తీరం) భిర్రానా, గిరవద్, ఫర్మానా, రాఖీగఢీల తవ్వకాల వల్ల హరప్పా నాగరికతా కాలం క్రీ.పూ.5500 సంవత్సరాలకు వెళ్లిందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.**

ఈ నాగరికత స్థానిక వ్యవసాయ సమాజాల వల్ల ఏర్పడ్డదనే అభిప్రాయం బలపడుతున్నది. స్థిరజీవన సమాజాలు మిగులుతో చేసిన వ్యాపారాల కోసం నిర్మించుకున్న పటిష్ఠ నగర వ్యవస్థ, వ్యాపార స్థావరాలు, రేవుల అభివృద్ధి, వస్తు సమృద్ధి, ధాన్య సమృద్ధులకు తార్కాణం. లోహ సంగ్రహణం, లోహ కర్మాగారాలు, లోహ వస్తువుల తయారీ నైపుణ్యాలు, ప్రామాణికమైన కొలతల పాటింపు, పింగాణీ ద్రవ్య వాడకం, ఇట్లా పలువిధాలా ఈ నాగరికత ప్రపంచ నాగరికతల్లో విశిష్ట స్థానాన్ని సాధించింది.

హరప్పా నాగరిక నగరాల్లో మొహెంజొదారో, హరప్పా, గన్వేరివాలా, రాఖీగఢీ, ధోలవీర ప్రధానమైనవి. గడిచిన వందేండ్లలో పురాశాస్త్రవేత్తలు కాలీబంగన్, ఫర్మానా, రాఖీగఢీ, సనౌలి వంటి ఎన్నో హరప్పా నగరాల్లో సమాధుల స్థలాలను అన్వేషించారు. ఈ ప్రదేశాల నుంచి సేకరించిన సమాచారం ఇంకా సమగ్రత సంతరించుకోలేదు. 2 వేల చోట్ల ఆర్కియాలాజికల్ సర్వే నిర్వహించారు. సాపేక్షికంగా కొన్ని శ్మశానస్థలాలను పేర్కొన్నారు. పురావేత్తలు, మానవ శాస్త్రవేత్తలు సమాధుల నుంచి సేకరించిన అస్థిపంజర వివరాలు, హరప్పా సమాజాల మానవ సంబంధాల గురించి, లోతట్టు ప్రదేశాల నుంచి ప్రజల వలసల గురించి పరిశోధించారు. ఆహారం, ఔషధాలు వంటివి పరిశీలన చేశారు. వాటిని బట్టి అప్పట్లో అధికార వికేంద్రీకరణ గల సమాజాలుండేవని అనిపిస్తున్నది. కొన్ని అసాధారణ సమాధుల్లో కపాల గాయాలు, తీవ్రమైన గాయాలు, కుష్టు వంటి వాటిని అస్థిపంజరాల్లో స్కగ్ గుర్తించారు. సమాధుల పరిశీలనలో సాంఘిక, సాంస్కృతిక చలనశీలతను తెలియజేశాయి. రాఖీగఢీ పురావస్తు సముదాయాల గురించి భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ, పూణే దక్కన్ కాలేజీ పరిశోధనలు నిర్వహించారు. రాఖీగఢీ మంచి వ్యవసాయ భూములతో కూడుకున్నదని తెలుస్తున్నది. హరప్పా నాగరిక నగరాల్లో ఇది తూర్పు ప్రాంత రాజధానిగా ఉండేదని పురా శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇక్కడ ఉన్న 11 సమాధులను తవ్వి శాస్త్రవేత్తలు సమాచార సేకరణ చేశారు. వీటిలో సెపల్చరల్ (శవసహిత), నాన్-సెపల్కరల్ (శవరహిత) సమాధులు కనిపించడం విశేషం. వీటిని హరప్పా పురావేత్తలు ప్రాథమిక, గౌణ, సాంకేతిక మొదలైన విభాగాలను, ఉప విభాగాలను విశ్లేషించారు. సమాధుల్లో ఇటుకల వాడకం ఇక్కడి ప్రత్యేకత. అక్కడ దొరికిన కర్బన పదార్థాలకు చేసిన కార్బన్ డేటింగ్‌లో అవి క్రీ.పూ. 2273-38 సంవత్సరాలకు చెందినవిగా తేలింది.

**సింధూ నాగరికతలో సబ్బురాయి ముద్రలలో ఒంటి కొమ్ము జంతువు, జడల ఎద్దు, మూపురమున్నవి, మూపురం లేని ఎడ్లున్నాయి. ముద్రల మీది బొమ్మలు ఆనాటి ప్రజల ధార్మికతత్వాన్ని తెలియజేసేవే. కులీనుడో, పూజారో అతని బొమ్మ స్టియొటైట్ (సబ్బురాయి)లో చెక్కింది మొహెంజొదారోలో లభించింది (ఇది కరాచీలో ఉన్న పాకిస్థాన్ జాతీయ మ్యూజియంలో ఉంది). నగ్న నాట్యకన్య కంచు శిల్పమొకటి కూడా దొరికింది. శిలల శిల్పాలు అరుదు.**

హరప్పా ముద్రల మీది భాష ఇండో యూరోపియన్ భాషా కుటుంబం, సుమేరియన్, హర్రియన్, ఎలమైట్ భాషలకు చెందినది కాదు. దాదాపు 2 వేల ముద్రలలో 500 లిపి చిహ్నాలున్నాయి. ఈ లిపిని ఎవరూ చదవలేదు. ఈ భాష ద్రవిడ భాషా కుటుంబానికి చెందినదని కొందరు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు, సిం నాగరికతలో ఒకే రకమైన వస్తు సంస్కృతి ఉన్నది. అది విస్తృతమైన సింధూ సాంస్కృతిక ఏకతను చూపుతున్నది. సింధూ నాగరికత విశేషాలు వెలుగుచూసి ఇటీవల వందేండ్లు పూర్తయ్యాయి. అయినప్పటికీ దానికి సంబంధించిన చాలా అంశాలు అపరిష్కృతంగానే ఉండటం విశేషమే మరి!

(వ్యాసకర్త: కన్వీనర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం)



తమ ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను చూపిస్తున్న హైడ్రా బాధితుడు బొడిగె నర్సింహ కుటుంబీకులు

# ఆ ఇంట్లనే సచ్చిపోతం

*2024, సెప్టెంబర్ 25 గురువారం నాడు మజ్జాన్నం ఒంటి గంట గొడ్తున్నది. మబ్బుల రెండు గంటలకు లేసి కూరగాయలమ్మవోయిన మేం ఇద్దరాలుమగలం అప్పుడే ఇంటికి చేరుకుంటున్నం. కూడు లేదు, కుంపటి లేదు. కడుపుల పేగులు గుర్.. గుర్రుమని మొత్తుకుంటున్నయి. ఇంత సల్ల వడ్దామని ఆగమాగం ఇంటికి వోతున్నం. మా ఇంటికి ఓ ఇరువై గజాల దూరంల ఉన్నం గావొచ్చు. ఎన్నడూ మా ఇంటిమొకాన రాని పోలీసులు లాఠీలు వట్టుకొని కనవడ్తున్నరు. పోలీసు జీబులు కనవడ్తున్నయి. కండ్లకు అద్దాలు వెట్టుకొని, టిక్కు, టక్కు ఏస్కొని ఉన్న అధికారులు చేతిల ఏవో పేపర్లు వట్టుకొని ఉన్నరు. టేప్ వట్టుకొని మా ఇంటి గోడల్ని కొలుస్తున్నరు. పక్కన్నే ఎర్రకలర్ బ్రెష్ వట్టుకొని ఓ మనిషి నిల్సున్నడు. 'వద్దంకుల్, వద్దంకుల్..' అని నా బిడ్డ నివేదిత, కొడుకు యశ్వంత్ గుక్కపట్టి ఏడుస్తనే ఉన్నరు. మమ్మల్ని జూసిన మా పిల్లలు దగ్గరికి ఉరికచ్చి గట్టిగ అల్లుకున్నరు. వాళ్ల ఎగవోసుకుంట చెప్పే మాటలు మాకర్థమైతలేవు.*

***

నా పేరు బొడిగె నర్సింహ. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నాకు అప్పుడే పదిహేనేండ్లు వడ్డయి. నాయిన బొడిగె అంజయ్య తాళ్లెక్కుతడు. 'నాయినా.. నేన్గూడ నీతోని తాళ్లెక్కుడు నేర్సుకుంట' అనడిగిన. 'నేన్ గీసిన కల్లే రోజు నేల పాలైతున్నది, నువ్వు తాళ్లెక్కి ఏం జేస్తవ్‌రా?' అని శెప్పకుండనే ఆ పని వద్దని శెప్పిండు. ఇగ ఇక్కడుంటే ఫాయిదా లేదని పట్నం బాట వట్టిన. పట్నం వచ్చిన కొత్తల రోజుకు పది రూపాల కూలికి కల్లు కాంపౌండ్ల పనికి కుదిరిన. గడియ రికాం లేదు, గవ్వ రాకట లేదన్నట్టు.. ఎన్నేండ్లు పజ్జేసినా ఎన్కేసింది మాత్రం ఏం లేదు. అది పోను 'పిలగాడు కల్లు కాంపౌండ్ల పజ్జేస్తడటనవ్వా..' అని పిల్లనిచ్చేటందుకు గూడ ఎవ్వలు ముందుకు రాలె. ఇగ లాభం లేదని కుట్టుమిషిన్ పన్నేర్సుకున్న. ఆ పజ్జేస్తుండంగనే కొన్నిరోజులకు సువర్ణ నాకు జతయింది. కొన్ని రోజులకు మాకిద్దరు పిల్లలు గూడ వుట్టిర్రు. రెడీమేడ్ బట్టల పుణ్యమాని కుట్టుమిషిన్ పని గూడ కుంటువడ్డది. ఆ రోజుల్ల కడుపున వుట్టిన పోరగాండ్లకు కడుపు నిండా తిండివెట్టలేని పరిస్థితి. ఓ రోజు మేం కిరాయి ఉన్న ఇంటి ఓనర్ అచ్చి 'అచ్చే నెల కిరాయి గట్టకుంటే సామాన్లు బయట వారేస్త' అని బెదిరిచ్చిండు. ఆయన మాటలు మా ఇద్దరాలుమొగల్ని ఎన్టీఆర్‌నగర్‌లోని మార్కెట్ బాట వట్టించినయి. అప్పట్నుంచి ఇప్పటిదాకా దగ్గెర దగ్గెర ఇరువై ఐదేండ్లయితున్నయి గావొచ్చు అటు మిషిన్ కుట్టుకుంటనే, ఇటు కూరగాయలు గూడ అమ్ముతున్నం.

నాటి నుంచి తినో, తినకనో.. పస్తులుండో, పచ్చడి మెతుకులు దినో.. కడుపు మాడ్సుకొనో, కారంతోని దినో.. కట్టవడి, శెమటోడ్చి పైసా పైసా పోగేసుకున్నం. రూపాయి రూపాయి కూడవెట్టుకున్నం. ఇల్లు లేని బతుక్కు ఇల్వలేదని అర్థమైంది. అందుకే ఎట్లనన్న జేసి పట్నంల ఓ గూడు కట్టుకోవాలనుకున్నం. పట్నంల గూడు కట్టుకునుడంటే ఉత్త ముచ్చటనా? ముందుగాళ్లనైతే జాగ కొనుక్కుందాం, ఆ తర్వాత గూడు నిలవెట్టుకుందామని అగ్గువకచ్చే జాగ కోసం ఎన్కులాడినం. మాకు దగ్గట్టే, మేం అనుకున్నట్టే ఓ 117 గజాల భూమి అమ్మకానికొచ్చింది. బ్యారం కుదిరింది. మేం గూడ బయాన వెట్టినం. ఆ భూమి ఎక్కన్నో గాదు, చైతన్యపురిలోని ఫణిగిరికాలనీ, సాయిబాబా గుడెన్క. మూసీ నది కొంచెం దూరాన, ఆ భూమి ముందు నుంచే వోతది. కట్టవడ్డ పైసలు గదా? అమ్మేటోని దగ్గర బోర్లవడద్దని అధికారుల దగ్గరికి గూడ వోయినం. ఆ భూమి కాయిదాలు సూపెట్టి 'ఈ భూమి మంచి దేనా సారు?, ముందు ముందు మాకేమన్న ఇబ్బందైతదా?' అనడిగితే 'ఈ భూమిల కొర్రీలేం లెవ్వు, బాజాప్తా కొనొచ్చ'ని భరోసా ఇచ్చిండు. తతిమా పైసలు గట్టి రిజిస్ట్రేషన్ గూడ చేపిచ్చుకున్నం. ఉన్న పైసలతోని జాగ కొనుక్కున్నమంటే ఇగ ఇల్లు కట్టుకునేటందుకు పైసలెక్కడియి? అందుకే సుట్టూ గోడలు వెట్టుకొని ఉన్నంతల నాలుగు రేకులు ఆల్సుకున్నం. మా ఇంటికి నెంబర్ ఉన్నది. నల్లా కనెక్షన్ ఉన్నది. కరెంటు మీటర్ గూడ ఉన్నది. పద్నాలుగేండ్ల నుంచి ఇదే ఇంట్ల ఉంటున్నం, ఇదే ఇంట్ల తింటున్నం. ఏ ఊరికి వోయినా నాత్రి ఈ ఇంటికి రావాల్సిందే. పుశ్కివొయి అక్కడున్నా నాకు నిద్రవట్టది. మళ్ల నా ఇంట్లకొచ్చి నడుమాలుస్తనే కంటి నిండా నిద్రవడ్తది.



***


**మా పిల్లల ఎగవోతల మజ్జన మా ఇల్లును కూలగొడ్తరనే విషయం మాకర్థమైంది. నేనో దిక్కు, మా ఇంటామె సువర్ణో దిక్కు వొయి 'మీ బాంఛెన్ సార్లు మా ఇంటికి రెడ్ మార్క్ వెట్టకుర్రి, మా ఇల్లు కూలగొట్టకుర్రని బతిలాడినం, ఆఖరికి కాళ్ల మీద గూడ వడ్డం. అయినా వాళ్ల మన్సు కర్గలే. కట్టవడి కట్టుకున్న ఇల్లును కూలగొడ్తమంటే కడుపు మండదా? అందుకే మా సువర్ణ అధికారులకు అడ్డం దిర్గింది. అంతే.. 'అరేయ్ ఈమెను గుంజిపారేయిర్రి, ఎక్వ తక్వ జేస్తే పోలీస్‌స్టేషన్‌కు తీసుకపార్రి' అని పోలీసాయన దబాయించిండు.**

ఓ దిక్కు మేం వద్దనుడు, ఇంకో దిక్కు వాళ్లు మమ్మల్ని గుంజిపారేసుడు. పేదోళ్లం, పైగా పైసల్లేనోళ్లం కదా? ఆఖరికి పెద్దోళ్లే గెలిసిర్రు. మా ఇంటికి రెడ్ మార్క్ పెట్టనే వెట్టిర్రు. అంటే.. మా ఇంటిని ఇగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూలగొడ్తడట. ఇంటికి రెడ్ మార్క్ వడ్డ కాన్నుంచి బుక్క నోట్లెకు వోతలేదు, కంటి మీద కునుకు లేదు. మా పిల్లలెక్కన్నో, మేం ఎక్కన్నో మాకే సమజైతలేదు. మార్కెట్‌కు పోవుడు లేదు, మన్ను బుక్కుడు లేదు.

పెళ్లీడుకొచ్చిన ఆడివిల్లతో సహా మమ్మల్ని రోడ్డున పడేయ్యాల్నని సీఎం రేవంత్ కంకణం గట్టుకున్నడు. కనీ, పొట్టోన్ని పొడుగోడు గొడ్తే, పొడుగోన్ని పోశమ్మ గొడ్తదట. మమ్మల్ని నాశనం జేయాల్నని జూస్తే, ఏదో రోజు వాళ్లు గూడ నాశనమై పోతరు. మా ఉసురు తాకుతది. అదే గురువారం పోలీసోళ్లు డీసీఎం వ్యాన్లు తీస్కచ్చిర్రు. 'కట్టుబట్టలతోని సామాన్లు సర్దుకొని ఈ వ్యాన్ల వొర్రి, లేకుంటే బలవంతంగ గుంజిపారేస్తమ'ని బెదిరిచ్చిపోయిండ్రు. అప్పటినుంచి మా ఫణిగిరికాలనీల పోలీసు జీబులు తిర్గుతనే ఉన్నయి. ఎప్పుడు బుల్డోజర్లు వస్తయోనని గుండెలు గుభేల్మంటున్నయి. క్షణక్షణం భయపడుకుంట బతుకుతున్నం. సీఎం సార్.. మమల్ని ఇంతగనం భయపెట్టుడెందుకు? ఆ బుల్డోజర్లను జప్పన పిలిపియ్యిర్రి. మేం ఇంట్ల ఉండంగనే కూలగొట్టుర్రి. ఇంటి నల్గురం మా ఇంట్లనే సచ్చిపోతం. మా ఇల్లే కూలినంక మేముంటేంది? లేకుంటేంది?



గడ్డం సతీష్
99590 59041







## ఆమె కూడా రాజీనామా చేయాలి!

*కోర్టు ఆదేశాల మేరకు నిర్మలా సీతారామన్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఆమె ఎవరు? ఆమె ఒక కేంద్ర మంత్రి. ఇప్పుడు ఆమె పైన కూడా ఎఫ్‌ఐఆర్ ఉంది. ఎన్నికల బాండ్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఆ విషయమై కేసు కూడా నమోదైంది. ఇప్పుడు నిర్మల కూడా రాజీనామా చేయాలి. రాజీనామా చేయాలని ఆమెను వాళ్లు (బీజేపీ నేతలు) అడగగలరా?*

*- సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి*